ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 31 సంచిక : 2 అక్టోబరు 2025

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 28
గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

డిజైనింగ్
అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్
(నందిగామ శేషసాయి)
పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,
పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ....... 2

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం



దైవభక్తి బలంగా ఉంటేనే
కానీ ప్రాణం పోయే
సమయంలో
భగవంతుడు
జ్ఞాపకం రాదు.
ప్రాణం పోయే క్షణంలో ఏ తలంపు ఉందో ఆ తలంపును
బట్టి నీకు పునర్జన్మ వస్తుంది.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 21 జూన్ 1996, కోడవల్లి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనలో ఉన్నటువంటి దుర్వాసనలని ఖండిస్తూ కొన్ని మాటలను ఆచార్యులవారు చెప్పారు. ఎందుచేత అంటే మన పునర్జన్మలకి కారణం దుర్వాసనలే. దుర్వాసనలు బట్టే మనకు రాబోయే జన్మలు ఆధారపడి ఉంటాయి. గురువుని ఆశ్రయించి, శాస్త్రాన్ని ఆశ్రయించి, భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకుని దుర్వాసనలని తొలగించుకోమని చెబుతూ మనల్ని అనుగ్రహించటానికి కొన్ని ఉపదేశం మాటలు చెప్పారు ఆచార్యులవారు. ఎందుచేత అంటే లోకాన్ని అనుగ్రహించాలి అనే కోరిక మనకి ఉన్నప్పటికీ అనుగ్రహించలేము, దానికి తగిన దక్షత ఉండాలి, సామర్థ్యం కూడా ఉండాలి. పదిమందిని బాగుచేద్దాం అన్న కోరిక మనకు ఉన్నంత మాత్రంచేత సరిపోదు. బాగుచేసే శక్తి కూడా మనకి ఉండాలి. ఆ శక్తిని ఈశ్వరుడు మనకి ఇస్తే వస్తుంది కానీ మనం బలవంతం చేసి, డిమాండ్ చేసి తెచ్చుకునేది కాదు. జ్ఞానం అనేది ఈశ్వరుడు యొక్క అనుగ్రహం వల్ల రావలసిందే కానీ ఈశ్వరుడిని బలవంతం చేసి తెచ్చుకునేది కాదు అది. పరమేశ్వరుడి యందు మనకి ప్రీతి లేకపోతే, పరమేశ్వరుడి యందు భక్తి లేకపోతే, పరమేశ్వరుడి యందు ప్రేమ లేకపోతే మనకు ఆయన అనుగ్రహం కలగదు. ఆయన అనుగ్రహం కలగకపోతే మనకి జ్ఞానం కూడా కలగదు.

కర్మఫలాన్ని దృష్టిలో పెట్టుకోకుండా నువ్వు పనిచేస్తే దేవుడి అనుగ్రహానికి పాత్రుడవు అవుతావు అని గీతలో పరమాత్మ చెప్పాడు. ఆ కర్మఫలం అనేది ఏ రకంగా కూడా ఉండకూడదు. అంటే మనకు గొప్పతనం రావాలి అని ఉండకూడదు, గౌరవం రావాలి అని ఉండకూడదు, ఏ రూపంలో కూడా నువ్వు కర్మఫలాన్ని ఆశించకూడదు. కర్మఫలం కనుక నువ్వు ఆశిస్తే దేహానికి, లోకానికి బంధింపబడతావు. కర్మఫలాన్ని ఆశించకపోతే దేవుడి అనుగ్రహానికి పాత్రుడవు అవుతావు, మోక్షసుఖాన్ని పొందుతావు, మోక్షస్థితిని పొందుతావు. ఆ మోక్షసుఖం ఎటువంటిది అంటే, మీకు ఎవరికైనా ఇప్పుడు ఒక వంద

కోరికలు ఉన్నాయి అనుకోండి, మీకున్న వంద కోరికలు ఒకే రోజున నెరవేరిపోయాయి అనుకోండి, అప్పుడు మీకు ఎంతో సుఖంగా, ఆనందంగా ఉంటుంది. కోరికలు నెరవేరినప్పుడు మీకు వచ్చే సుఖం, ఆనందం ఏదో ఉంటుంది కదా దానిని మోక్షసుఖం తోటి పోల్చుకుంటే ఆ సుఖం లక్షో వంతు కూడా ఉండదు, అటువంటిది మోక్షసుఖం. అంటే మీకు అంచనా కోసం చెబుతున్నాను. అలా అని మోక్షసుఖం కోసం మనం ముందుగా ఊహలు పెట్టుకోకూడదు. మోక్షసుఖం ఎలా ఉంటుంది అని నువ్వు ఊహించకూడదు. అలా ఊహించడం వలన మన ఊహలే మన మార్గానికి అడ్డు వస్తాయి. అందుచేత ఇక్కడ ఆచార్యులవారు ఏమని చెబుతున్నారు అంటే, మీరు కాలాన్ని దుర్వినియోగం చేసుకోకండి, కాలాన్ని పాడుచేసుకోకండి. మనకు రోజులు బాగానే వెళ్ళిపోతున్నాయి అని అనుకుంటున్నారు కానీ చావు దగ్గరకి వస్తోంది అన్న సంగతి మీకు తెలియడం లేదు. ఎండకి ఎండి పోకుండా, వర్షానికి తడిసిపోకుండా, చలి గాలి ఏమీ తగలకుండా, మీ శరీరాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకున్నా అది ఏదో ఒక రోజున బూడిద అవుతుంది అది మర్చిపోకండి అని వార్నింగ్ ఇస్తున్నారు ఆచార్యులవారు. మీ శరీరాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకున్నా ఏదో ఒక రోజున అది బూడిద అవుతుంది, అది మటుకు మర్చిపోకండి అని హెచ్చరిక చేస్తున్నారు ఇక్కడ ఆచార్యులవారు.

మీ ఎకనామిక్ స్టేటస్‌ని, సోషల్ స్టేటస్‌ని ప్రపంచం చూస్తుంది. కానీ భగవంతుడు మీ సోషల్ స్టేటస్‌ని, ఎకనామిక్ స్టేటస్‌ని చూడడు. డైరెక్ట్‌గా నీ హృదయం తోటి సంబంధం పెట్టుకుంటాడు. నీ హృదయంలో ఏముందో అది భగవంతుడికి కావాలి. లోకానికి ఏమి కావాలి అంటే నీ రంగు, నీ అధికారం, నీ చదువు ఇవి అన్నీ లోకానికి కావాలి. కానీ ఇవి ఏమీ భగవంతుడికి అక్కర్లేదు, ఇది అంతా మిథ్య అన్న సంగతి ఆయనకి తెలుసు. ఆయన మీ హృదయంలో ఏముందో అదే డైరెక్ట్‌గా చూస్తూ ఉంటాడు. లోకాన్ని మనం మోసం చెయ్యగలం కానీ భగవంతుడిని మనం మోసం చెయ్యలేము.

"Know god in your heart" అన్నారు ఆచార్యులవారు. నువ్వు కాశీలో దేవుడిని చూడడానికి వెళుతున్నావు, రామేశ్వరంలో దేవుడిని చూడడానికి వెళుతున్నావు, కానీ నీ

హృదయంలో ఉన్న దేవుడిని తెలుసుకోవడానికి నువ్వు ప్రయత్నం చేయడం లేదు అన్నారు ఆచార్యులవారు. దేవుడు నీ హృదయంలో కూడా ఉన్నాడు, నీ హృదయంలో ఉన్న దేవుడిని తెలుసుకోవడానికి నువ్వు ప్రయత్నం చెయ్యి. నీ హృదయంలో ఉన్న దేవుడిని కనుక నువ్వు ప్రత్యక్షం చేసుకుంటే నీకు కనిపిస్తున్న ఈ లోకం కూడా దైవసమానంగానే కనిపిస్తుంది. నీ హృదయంలో ఉన్న ఆత్మ నీకు ఎప్పుడైతే దర్శనం అయ్యిందో, అప్పుడు లోకం కూడా నీకు ఆత్మగానే కనిపిస్తుంది, లోకంగా కనపడదు, అప్పుడు మరణాన్ని జయిస్తావు. భగవంతుడు కాలరూపంలో ఉన్నాడు, రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అని అనుకోకండి, రోజులు బాగా వెళ్ళిపోతుంటే చావు దగ్గరకి వస్తుంది. మీరు కాలాన్ని సద్వినియోగం చేసుకుంటే ఈ లోకంలో ఉండగానే, ఈ శరీరంలో ఉండగానే మీకు బ్రహ్మానుభవం కలుగుతుంది, బ్రాహ్మీస్థితి కలుగుతుంది, అప్పుడు మీరు సుఖి అవుతారు. ఈ సంసారచక్రం నుండి మీరు ఒడ్డుకి వస్తారు, అంటే అజ్ఞానంలోంచి బయటపడతారు. రోగ కారణం నశిస్తేనే కానీ రోగం తగ్గదు. అజ్ఞానానికి కారణాలు ఏమిటో తెలుసుకొని ఆ కారణాలు మనం తొలగించుకుంటే అజ్ఞానం తగ్గుతుంది కానీ లేకపోతే అజ్ఞానం తగ్గదు. అంటే పొయ్యిలో ఉన్న కట్టెలు బయటకి తీస్తే నిప్పు ఆరుతుంది కానీ లేకపోతే నిప్పు ఆరదు. అదేవిధంగా ఏ కారణం వల్ల మనం అజ్ఞానానికి గురి అవుతున్నామో ఆ కారణాన్ని తొలగించినప్పుడే అజ్ఞానం నశిస్తుంది. కాని అజ్ఞానాన్ని తొలగించుకోవడానికి మనం ఎవరం ప్రయత్నం చెయ్యడం లేదు. కారణం ఏమిటి అంటే దానివల్ల వచ్చే అపాయం, దానివల్ల వచ్చే బాధలు మనకి తెలియడం లేదు.

మనిషి మాయ తోటి పోరాడాలి అంటే శాంత చిత్తం ఉండాలి. ప్రతీదానికి ఉద్రేక పడకూడదు. ఎవడికైతే శాంత చిత్తం ఉందో వాడే మాయ తోటి పోరాడగలడు, అంటే అజ్ఞానం తోటి పోరాడగలడు. మీకు ముందు కుదురు ఉండాలి, ఒక స్థిరమైన సంకల్పం ఉండాలి. కుదురు లేకుండా, స్థిరత్వం లేకుండా మాయ తోటి, అజ్ఞానం తోటి మనం పోరాడలేము. అంటే నీ బుద్ధిని శుద్ధి చేసుకోవడానికి, నీ మనస్సుని పవిత్రం చేసుకోవడానికి నీ కాలాన్ని సద్వినియోగం చేసుకో, కాలాన్ని పాడుచేసుకోకు. కాలాన్ని దుర్వినియోగం చేస్తుంటే ఆయనకు కూడా మనం అగౌరవ పరుస్తున్నట్టుగా భగవంతుడు భావిస్తాడు.

ఎందుచేత అంటే భగవంతుడు కాలస్వరూపంలో ఉన్నాడు. మనం పవిత్రులం అవ్వడం కోసం శాస్త్రాన్ని, గురువుని, దేవుడు చెప్పిన మాటని గౌరవించాలి. అంటే భగవంతుడు చెప్పిన మాట యందు గౌరవం మనకి లేకపోతే ఆ మాటలని ప్రాక్టీస్ చెయ్యడానికి మనం ప్రయత్నం చెయ్యము. మనం ధ్యానం చేసినా, జపం చేసినా, పూజ చేసినా, విచారణ చేసినా, మనం దేనికోసం చేస్తున్నాం అంటే దైవానుగ్రహం కోసం చేస్తున్నాం. ధ్యానం చెయ్యకపోతే, విచారణ చెయ్యకపోతే రాగ ద్వేషాలు నశించవు, దుర్వాసనలు నశించవు, అది ఇక్కడ ఆచార్యుల వారు చెప్పేది. నువ్వు ధ్యానం చేయవు అనుకో, భగవంతుడిని చింతించవు అనుకో, పరమేశ్వరుడు యందు నీకు ప్రీతి లేదనుకో, నీలోని రాగ ద్వేషాలు నశించవు. ఎవరింటికి వెళ్లి చూసినా, ఏ ఊరు వెళ్లి చూసినా, ఏ దేశం వెళ్లి చూసినా ఈ ప్రపంచంలో రాగ ద్వేషాలు తప్పించి ఏమీ లేవు అన్నాడు గౌతమ బుద్ధుడు. మన పునర్జన్మకి కారణం కూడా రాగద్వేషాలే. ఎవరైనా మనలని పొగిడితే వాళ్ళ మీద మనకి రాగం ఏర్పడుతుంది, ఎవరైనా విమర్శిస్తే ద్వేషం ఏర్పడుతుంది. ఈ రాగ ద్వేషాలు తీసుకొచ్చే ప్రమాదం మనకి అర్థం కావడం లేదు. వాటిని తొలగించుకోవడానికి మనం ప్రయత్నం చెయ్యాలి.

పోస్ట్ ఆఫీసులో ఉత్తరాల మీద ముద్రలు వేస్తారు. అలాగే మన పూర్వజన్మల నుంచి కొన్ని గుణాలు మన మనస్సులో ముద్రలు పడిపోయి ఉన్నాయి. పూర్వజన్మల్లో ఫలితాలు ఆశించి మనం పనులు చేశాం, ఆ ఫలితాలు అనుభవించడం వలన దాని తాలుక ముద్రలు మనస్సులో పడిపోయాయి. ఆ ముద్రల లోంచి బయట పడితేనే కానీ మన ముఖం జ్ఞానం వైపుకి తిరగదు. అందుచేత నువ్వు ఆ ముద్రలు చెరుపుకోవడానికి ప్రయత్నం చెయ్యి, ఆ దోషాలు తొలగించుకోవడం కోసం నువ్వు ప్రయత్నం చెయ్యి. భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు, కానీ లేడు అని మనం అనుకుంటున్నాము. ఎందుకు లేడు అనుకుంటున్నాం అంటే ఆయన ఏమీ గొడవ చెయ్యడు, సైలెంట్‌గా ఉంటాడు. భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు, ఆయన హృదయంలో ఉండి గొడవ ప్రారంభించాడు అనుకోండి ఉన్నాడు అని తెలుస్తుంది. ఆయన ఏమీ గొడవ

చేయడు. ఆయన ఉన్నట్టు మనకే తెలియదు, అంత సైలెంట్‌గా ఉంటాడు. కొంతమంది చుట్టాలు వస్తే వచ్చి వెళ్ళిపోయినట్టు జాడ కూడా తెలియదు. కొంతమంది చుట్టాలు వస్తే మన కొంప అంతా అల్లరి చేసి వెళ్ళిపోతూ ఉంటారు. అలా కాకుండా భగవంతుడు అందరి హృదయాలలో ఎలా ఉన్నాడు అంటే సైలెంట్‌గా ఉన్నాడు. కానీ నువ్వు చేసే పనులు, నీకు వచ్చే ఆలోచనలు ఆయన చూస్తూ ఉంటాడు. నువ్వు అలా చేస్తున్నావు ఏమిటి? ఇలా చేస్తున్నావు ఏమిటి? అని ఏమీ అనడు. కానీ భగవంతుడు నీ హృదయంలో నిశ్శబ్ధంగా ఉండి నువ్వు మాట్లాడే మాటలు, నీకు వచ్చే ఆలోచనలు, నువ్వు చేతి తోటి చేసే పనులు చూస్తూ ఉంటున్నాడు అన్న సంగతి నువ్వు మర్చిపోవద్దు అంటున్నారు ఆచార్యులవారు. నీ తలంపులు ఎటువంటివో నేను చూస్తున్నాను అని మనతోటి కూడా చెప్పడు, అంత గుట్టుగా ఉంటాడు, సైలెంట్‌గా ఉంటాడు పరమేశ్వరుడు. అంత సైలెంట్‌గా ఉండడం వలన ఆయన ఉన్నాడు అన్న సంగతి కూడా మనకి తెలియడం లేదు.

భగవంతుడు చెప్పిన మాటలను, మహాత్ముల చరిత్రలు, గురువు చెప్పిన మాటలను మనం జాగ్రత్తగా మననం చెయ్యాలి. మన హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు అన్న గుర్తింపు మనకి రావడం కోసం, శాస్త్రం ఈశ్వరుడి హృదయం లోంచి వచ్చింది కాబట్టి ఆ శాస్త్రాన్ని మనం ప్రమాణంగా తీసుకుని, ఆ శాస్త్రంలో చెప్పిన విషయాలను ఆచరించటానికి మనం ప్రయత్నం చేయాలి. విన్నంత మాత్రంచేత అనుభవంలోకి రాదు, మీరు జాగ్రత్తగా విషయాన్ని విని, మననం చేసుకుని, అర్థం చేసుకుని ఆచరించి మీరు అనుభవంలోకి తెచ్చుకోవాలి. ఆచరించినది అనుభవంలోకి వస్తుంది కానీ ఆచరించనిది అనుభవంలోకి రాదు. అందుచేత ఇక్కడ ఆచార్యులవారు చెప్పేది ఏమిటంటే, నువ్వు కాలాన్ని దుర్వినియోగం



**సూర్యుని ముందు కిరసనాయిలు దీపం ఎలా ఉంటుందో నిజమైన సుఖం ముందు నీ ప్రారబ్ధం వలన వచ్చే సుఖం అలాగే ఉంటుంది.**

చేసుకోకు. నీ కాలాన్ని సద్వినియోగం చేసుకో, టైము మటుకు నువ్వు అనవసరంగా పాడు చేసుకోకు, ధ్యానం చేసుకో, అంటే ధ్యానం చెయ్యగా, చెయ్యగా నీ రాగ ద్వేషాలు నశిస్తాయి. అందుచేత నువ్వు ధ్యానం చేసుకోవాలి, మనం బాగుపడాలి అనేటటువంటి కాంక్ష నీకు రావడం కోసం మహాత్ముల చరిత్రలు కూడా చదువుతూ ఉండు. సాధువుల తోటి స్నేహం మంచిదే, సత్పురుషుల తోటి సహవాసం మంచిదే, మహాత్ముల తోటి స్నేహం చెయ్యడం మంచిదే, కానీ అందులో కూడా ఒక చెడ్డ ఉంది అన్నారు ఆచార్యులవారు. అదేమిటంటే సత్పురుషుల తోటి సహవాసం చేసినప్పుడు శాంతిగా ఉంటుంది, ఆనందంగా ఉంటుంది. వారిని విడిచిపెట్టి వెళ్ళేటప్పుడు దుఃఖం వస్తుంది అదొక్కటే చెడ్డ అన్నారు ఆచార్యులవారు. అంటే ఎవరైనా మహాత్ముల దగ్గర కూర్చున్నాం అనుకోండి, వేసవి కాలంలో చల్లటి గాలి వేస్తే మనకి ఎలా ఉంటుందో, అంత శాంతిగా, సుఖంగా ఉంటుంది మహాత్ముల సన్నిధిలో కూర్చున్నప్పుడు, శాంతి కలుగుతుంది, సుఖం కలుగుతుంది, మన హృదయం లోంచి ఆనంద కెరటాలు వస్తాయి. కానీ అక్కడ ఉన్నంతసేపు బాగానే ఉంటుంది. వారిని విడిచిపెట్టి వెళ్ళేటప్పుడు మళ్ళీ మనకి దుఃఖం వస్తుంది. మహాత్ములని విడిచిపెడుతున్నాం, సత్పురుషులకి దూరం అయిపోతున్నాము అని దుఃఖం వస్తుంది, అది ఒక్కటే చెడ్డ సత్పురుషుల సాంగత్యంలో అన్నారు ఆచార్యులవారు. అందుచేత మీరు సత్పురుషుల సహవాసం చెయ్యండి, శాస్త్రంలో చెప్పిన వాక్యాలని ధ్యానం చెయ్యండి, శ్రద్ధగా వినండి, మనస్సుకి పట్టించుకోండి, జాగ్రత్తగా ధ్యానం చెయ్యగా, చెయ్యగా, విచారణ చెయ్యగా, చెయ్యగా పరమేశ్వరుడు యందు మీకు భక్తి అభివృద్ధి పొందగా, పొందగా పూర్వజన్మల నుంచి మీ మనస్సులో ముద్రలు పడ్డ దోషాలు ఆ బలహీనతలు అన్నీ ఒకొక్కటి ఒకొక్కటి చెరిగిపోయి రాలిపోతాయి అంటున్నారు ఆచార్యులవారు.

బయట శత్రువుల వల్ల మనకు ప్రమాదం ఏమీ లేదు. మన పునర్జన్మలకి కారణం బయట శత్రువులు కాదు, మన హృదయంలో ఉన్న శత్రువులే మన పునర్జన్మలకి కారణం. నీ లోపల ఉన్న శత్రువుని నువ్వు జయిస్తే బయట నీకు శత్రువులే కనపడరు అన్నారు ఆచార్యుల వారు. నీ లోపల శత్రువులే బయట శత్రువులుగా నీకు కనిపిస్తున్నారు. అంటే నీ పునర్జన్మలకి

బయట శత్రువులు కారణం కాదు. నీ పునర్జన్మలకి కారణం, నీ అజ్ఞానానికి కారణం, నువ్వు సంసార ప్రవాహంలో కొట్టుకుని పోవడానికి కారణం, ప్రకృతి గుణాలలో కొట్టుకుని పోవడానికి కారణం అవి నీ హృదయంలోనే గుణాల రూపంలో ఉన్నాయి. నీ గుణాలే నీ శత్రువులు, నీ గుణాలే నీ సంకెళ్ళు, నీ గుణాలే నీ భారాలు. అంటే మాయ ఎక్కడో లేదు మనలో రజోగుణం, తమోగుణం రూపంలో మాయ ఉంది. ఎక్కడో బాహ్యంగా అది లేదు. పరమేశ్వరుడిని మనం ధ్యానం చెయ్యగా, చెయ్యగా అంటే స్మరించగా స్మరించగా, Remember god, always remember god, more remember god, more and more remember god. అలా నిరంతరం భగవంతుడిని స్మరించడం వలన ఆయన తోటి మనకి మానసికమైన అనుబంధం ఏర్పడుతుంది. మీరు రోజూ ఉదయం గుళ్ళోకి వెళ్లి రావచ్చు, ప్రతీ నిమిషం మనం గుళ్ళో కూర్చోలేము కదా, అందుచేత ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే నీ హృదయంలోనే దేవుడు ఉన్నాడన్న భావన చెయ్యి. నిరంతరము విరామం లేకుండా, విశ్రాంతి లేకుండా నీ మనస్సు తోటి నీ హృదయంలో ఉన్న దేవుడిని అర్చన చేయడానికి, పూజ చేయడానికి అలవాటు చేసుకో. అలా అలవాటు చేసుకుంటే నీ హృదయంలో ఉన్న మరకలు అన్నీ చెరిగిపోతాయి అంటున్నారు ఆచార్యులవారు. దానిని మానసిక పూజ అంటారు.

నీ హృదయంలో దేవుడు ఉన్నాడు, ఆయనే నిజమైన దేవుడు. నీ దేహం ఉన్నా, లేకపోయినా నీ ఉపాధి తోటి సంబంధం లేకుండా సర్వకాల సర్వ అవస్థల్లో ప్రకాశిస్తున్న దేవుడు నీ హృదయంలోనే ఉన్నాడు అన్న సంగతి నీకు ఏ జన్మకి తెలుస్తుంది అంటున్నారు ఆచార్యులవారు. నీ హృదయంలో దేవుడు ఉన్నాడు అని, నీ శరీరం చచ్చిపోయినప్పుడు ఆ దేవుడు కూడా చచ్చిపోతున్నాడు అని నువ్వు అనుకోకు. నీ ఉపాధి తోటి, నీ శరీరం తోటి వాడికి ఎట్టి సంబంధం లేదు. కాని నీ హృదయంలో ఉన్నాడు సైలెంట్‌గా ఉన్నాడు, నిరాడంబరంగా ఉన్నాడు, నిర్మలంగా ఉన్నాడు. వాడు చూస్తున్నాడు, చూస్తున్న సంగతి చెప్పడు వాడు. వాడు దేవుడు. ఆ దేవుడు అంటే మనకి ఇష్టం ఉండదు, గుళ్ళో దేవుడు అంటే మనకు ఇష్టం. ఎందుచేత ఇష్టం అంటే మన శరీరం ఎంత నిజమో గుళ్ళో ఉన్న దేవుడు కూడా అంతే నిజం. కానీ నిజమైన దేవుడు హృదయంలో ఉన్నాడు. మన మనస్సు కూడా నిజం

కాదు కాబట్టి నిజమైన దేవుడు దగ్గరకి వెళ్ళమంటే ఈ మనస్సు వెళ్ళదు. గుళ్ళో ఉన్న దేవుడు దగ్గరకి వెళ్ళమంటే మనస్సు వెళుతుంది. ఎందుచేత అంటే నిజమైన దేవుడు దగ్గరకి వెళితే ఈ మనస్సుని ఆ దేవుడు మింగేస్తాడు అని దానికి భయం. అందుచేత సత్పురుషుల తోటి సహవాసాలు చెయ్యండి, సద్గ్రంథాలు చదవండి, మీరు చెయ్యగలిగినంత ధ్యానం చెయ్యండి, విచారణ చెయ్యండి. అలా చెయ్యడం వలన పూర్వజన్మలోని ముద్రలు అన్నీ తొలగిపోతాయి. అంటే ఇక్కడ మీరు అర్థం చేసుకోవలసింది ఏమిటి అంటే ఆచార్యుల వారు చాలా నొక్కి నొక్కిచెప్పేది ఏమిటి అంటే ఏ హేతువుల వల్ల మీకు పునర్జన్మలు వస్తున్నాయో ఈ శరీరం ఉండగానే ఆ హేతువులని తొలగించుకోగలిగితే మీరు పునర్జన్మ లేని స్థితికి ఎదిగి వెళ్ళిపోతారు. అంటే పునర్జన్మకి హేతువులు నీ హృదయంలో ఉన్నాయి. మీరు శరీరం ఉండగానే అంటే మీ శరీరం మరణించక ముందే మీరు సాధన చేసి ఆ పునర్జన్మ హేతువులని కనుక, ఏ కారణం వలన మీకు పునర్జన్మ వస్తుందో, ఆ కారణాన్ని మీరు తొలగించుకోగలిగితే మీరు జన్మ లేని స్థితికి ఎదుగుతారు, అప్పుడు మీరు సుఖస్వరూపం పొందుతారు.

పూర్వజన్మల్లో నువ్వు చేసిన పనిని బట్టి పరమేశ్వరుడు నీకు ఈ దేహం ఇచ్చాడు. విసుగు లేకుండా, చిరాకు లేకుండా, కోపం లేకుండా ప్రారబ్ధాన్ని సంతోషంగా అనుభవించు. అలా అనుభవిస్తే ప్రారబ్ధం నశిస్తుంది, కొత్త వాసనలు రావు అంటున్నారు ఆచార్యులవారు. నీ దేహానికి ఒక ప్రారబ్ధం ఏర్పడింది, ప్రారబ్ధం లేకపోతే ఆ దేహం రాదు. ఆ ప్రారబ్ధాన్ని సంతోషంగా అనుభవించు, నీ దేహ ప్రారబ్ధాన్ని ఎప్పుడైతే నువ్వు సంతోషంగా అనుభవించావో ప్రారబ్ధం నశిస్తుంది. అంటే పాత వాసనలు పోతాయి, కొత్త వాసనలు రావు, పునర్జన్మలు లేని స్థితికి ఎదిగి వెళతావు. మోక్షస్థితి నీకు అందుబాటులోకి వస్తుంది. ప్రారబ్ధాన్ని నువ్వు ఆముదం నోట్లో పెట్టుకున్నట్టు అనుభవించకు, పాయసం నోట్లో పెట్టుకొన్నప్పుడు, నాటుకోడి తిన్నప్పుడు ఎలా ఉంటావో అలా అనుభవించు. Enjoy your Prarabdha నీ ప్రారబ్ధాన్ని అలా ఎంజాయ్ చెయ్యి. కొంతమంది ఏకాంతవాసంగా ఉండలేరు, ఏకాంతంగా ఉండడం కూడా నువ్వు ఎంజాయ్ చెయ్యగలిగితే నీకు పునర్జన్మలకి కారణాలు ఆరోజుకారోజు తగ్గుతూ ఉంటాయి. అందుచేత నీకు ఎంత ఆనందం కావాలో అంత ఆనందం నీ హృదయంలో

ఉంది. బాహ్యమైన వ్యక్తుల మీద కానీ, బాహ్యమైన సంఘటనల మీద కానీ, బాహ్యమైన వృత్తుల మీద కానీ నీ ఆనందం కోసం ఆధారపడి ఉండక్కర్లేదు. Unlimited peace, unlimited happiness నీ హృదయంలో ఉంది. నీ హృదయంలో శాంతి సముద్రం ఉంది, సుఖ సముద్రం ఉంది, ఆనంద సముద్రం ఉంది. నువ్వు ధ్యానం చేస్తే నీ హృదయంలో ఉన్న సుఖం నీకు అందుతుంది.

ఆచార్యుల వారు ఏమంటున్నారు అంటే నువ్వు శ్రద్ధగా చదువుకో, నువ్వు చదువుకున్న విషయాన్ని understand చేసుకో, నువ్వు అర్థం చేసుకున్న విషయాన్ని ధ్యానం చెయ్యి. ఎప్పుడైతే నీ ధ్యానం యొక్క లోతులు పెరుగుతున్నాయో, జపం యొక్క లోతులు పెరుగుతున్నాయో, నీ హృదయంలో ఉన్న ఆనంద సముద్రం, శాంతి సముద్రం, సుఖ సముద్రం పొంగి నీ సహస్రారాన్ని ముంచుతుంది అంటున్నారు ఆచార్యులవారు. అందుచేత ఇతరుల మెప్పుల కోసం, ఇతరుల గొప్పల కోసం నువ్వు ఏమీ పనులు చెయ్యకు. భగవంతుడు ఏవిధంగా అయితే సైలెంట్‌గా తన పని తాను చేసుకుంటూ వెళ్ళిపోతున్నాడో అలా సైలెంట్‌గా పని చేయటం నేర్చుకో అంటున్నారు ఆచార్యులవారు. అలా నీకు చేతనైతే మంచిదే, చేతకాకపోతే నేర్చుకో! మన జీవితాలు ఇలా రూపుదిద్దుకున్నాయి అంటే దానికి పూర్వజన్మలే కారణం. ఈ జన్మలో ఏదైనా సంఘటన మన జీవితంలో జరుగుతుంటే ఈ సంఘటన ఇలా ఎందుకు జరిగింది, ఆ సంఘటన అలా ఎందుకు జరిగింది అని నువ్వు అనుకుంటూ ఉంటావు. దానికి, పూర్వజన్మలకి ఏదో సంబంధం ఉంటుంది, ఆ సంబంధం బట్టి ఈ సంఘటన జరుగుతుంది. జరిగిపోయిన పూర్వజన్మ నీకు తెలియదు, దానికి పరిణామమే ఈ సంఘటనలు జరుగుతున్నాయి. అందుచేత ఈ ప్రారబ్ధాన్ని ఏడుస్తూ అనుభవించకుండా సంతోషంగా అనుభవించి భవిష్యత్తులో ఉత్తమజన్మలు రావడానికి తగిన పునాదులు ఏర్పాటు చేసుకో. నువ్వు కాలాన్ని పాడుచేసుకోకు అంటున్నారు. నువ్వు డైరెక్ట్‌గా మోక్షానికి వెళ్ళగలిగితే సరేసరి, లేకపోతే ఇంతకంటే ఉత్తమ జన్మలు రావడానికి నువ్వు ప్రయత్నం చేసుకుంటే నీ సాధన అనుకూలంగా జరుగుతుంది. మన జీవితం ఇలా ఉంది ఏమిటి అని నువ్వు బాధ పడుతున్నావు. ఈ జీవితానికి నీ పూర్వజన్మలే కారణం. ఉత్తమజన్మలు అంటే భగవంతుడిని

తెలుసుకోవడానికి అనుకూలమైన జన్మలు రావడానికి సత్కర్మని ఆచరించు. సత్కర్మని ఆచరించడం కూడా advertisement కోసం, publicity కోసం కాకుండా, భగవంతుడు చేస్తున్నట్టు నిర్మలంగా చెయ్యడం, నిశ్శబ్దంగా చెయ్యడం, నిరాడంబరంగా చెయ్యడం అలవాటు చేసుకో.

జన్మాంతరాల నుంచి వాసనలు నీకు వస్తున్నాయి. ఆ వాసనలను పొడిగించుకోవడం మానేసి వాటిని కట్ చెయ్యడానికి ప్రయత్నం చెయ్యి. ఏదోదోషం నీలోఉందనుకో ఆదోషం పెంచుకోవడానికి ప్రయత్నం చెయ్యకు, దానిని కట్ చెయ్యడానికి నువ్వు ప్రయత్నం చెయ్యి. అలా ప్రయత్నం చేస్తే కనీసం రాబోయే జన్మ అయినా ఉత్తమ జన్మ వస్తుంది. నీ గురించి గొప్పలు చెప్పుకోకు, నీ శరీరమే నీ కూడా రానప్పుడు నీ గొప్పలు నీ కూడా రావు. మీకు అర్థం అవుతోందా? మనం చెప్పుకున్న గొప్పల్లో ఒక్క గొప్ప కూడా మన కూడా రాదు. ఈ గొప్పలు చెప్పుకోవడం వలన నువ్వు ఆరోజుకారోజు అజ్ఞానంలో కూరుకుపోతావు, కానీ నీకు మటుకు జ్ఞానం రాదు. కొంతమంది వాళ్ళలో వాళ్ళు ఏవో గొప్పలు చెప్పుకుంటూ ఉంటారు. ఈ గొప్పలు వల్ల చివరికి తిప్పలు వస్తాయి కాని జ్ఞానం రాదు. ఇవన్నీ ఒక పక్కకి పెట్టి, నీ అహంభావనని ఒక పక్కకి పెట్టి నువ్వు భగవదనుభవం పొందడానికి ప్రయత్నం చెయ్యి. నీకు భగవదనుగ్రహం లేకుండా భగవదనుభవం రాదు. భగవంతుడిని నిరంతరం స్మరించడం వలన, ఆయన తోటి మానసికంగా కనెక్షన్ పెట్టుకోవడం వలన భగవదనుగ్రహం పొందడం కోసం అది నీకు సహాయం చేస్తుంది. మాములుగా మీకు కోపం రాదు, మీరు అందరూ బాగానే ఉంటారు. మీ కోరిక నెరవేరనప్పుడు మాత్రమే మీకు కోపాలు వస్తాయి అంటున్నారు ఆచార్యులవారు. ఇప్పుడు మీరు అందరూ బుద్ధిడితోటి సమానంగా ఉన్నారు, ఎవరికీ కోపాలు లేవు. కానీ మీ కోరిక ఎప్పుడైతే నెరవేరలేదో అప్పుడే మీకు కోపాలు వస్తాయి, తాపాలు వస్తాయి. కోరికలు నెరవేరితే అందరూ బాగానే ఉంటారు. ఆ కోరిక నెరవేరనప్పుడే మీకు కోపం వస్తుంది, తాపం వస్తుంది, దుఃఖం వస్తుంది. అందుచేత మీకు కోరిక నెరవేరినా, నెరవేరకపోయినా, సమానంగా కనుక ఉంటే మీరు కోపానికి దూరం అవ్వచ్చు. ఆలోచన ప్రధానం. మాటిమాటికి ఉద్రేకం పొందకండి, ఎమోషన్‌కి గురి కావద్దు.

ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే రోజూ నువ్వు గుళ్ళోకి వెళ్లి కూర్చున్నంత మాత్రం చేత అది భక్తి కాదు, నీ హృదయంలో ఉన్న దేవుడిని తెలుసుకోవడానికి నువ్వు చేసిన ప్రయత్నమే భక్తి. మీరు గుళ్ళోకి వెళ్ళవచ్చు, పది నిముషాలు కూర్చుని రావచ్చు. అంతమాత్రం చేత మీకు భక్తి ఉన్నట్టు కాదు. నీ హృదయంలో ఉన్న పరమేశ్వరుడిని నువ్వు అనుభవంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నం చెయ్యాలి. భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడు, అంతటా సమానంగా ఉన్నాడు, హెచ్చుతగ్గులుగా లేడు పరమేశ్వరుడు. భగవంతుడు ఎలా సమానంగా ఉన్నాడో అటువంటి సమానబుద్ధి కనుక నీకు కలిగితే నీకు సాయుజ్య మోక్షం వస్తుంది అంటున్నారు ఆచార్యులవారు. సాయుజ్యం అంటే జీవుడు పరమేశ్వరుడిలో ఐక్యం కావడం. మీకు అర్థం అవుతోందా? సాయుజ్య ముక్తి అంటే నువ్వు విష్ణుమూర్తిలో ఐక్యం అవుతావు. ఐక్యం అయినప్పుడు ఈ దేహగతమైన నేను పోతుంది కానీ నువ్వు ఉన్నావన్న సంగతి నీకు తెలుస్తూనే ఉంటుంది. నువ్వు పోవు, కానీ దేహగతమైన నేను మటుకు నశిస్తుంది, అది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. చాలామంది మోక్షం వస్తే నేను పోతుంది ఏమో అని కంగారు పడుతున్నారు. అబద్ధమైన నేను పోతుంది కానీ నిజమైన నేను పోదు. అంటే నీకు మోక్షం రావడం వలన పునర్జన్మకి హేతువు అయినటువంటి దేహగతమైన నేను పోతుంది కానీ నిజమైన నేను మటుకు పోదు. నేను ఉన్నాను అన్న సంగతి నీకు తెలుస్తూనే ఉంటుంది అదే మోక్షం.

మాటిమాటికి కోపాలు తెచ్చుకోకు. మీకు మాటిమాటికి కోపం వస్తుంటే మీకు ఏదో శాపం ఉంది అన్నమాట. మాటిమాటికి చిరాకులు వస్తుంటే మీకు ఏదో శాపాలు ఉన్నాయి. ఆ శాపాలు లోంచి బయట పడడానికి నువ్వు ప్రయత్నం చెయ్యి. వెంటనే నువ్వు కోపం జయించలేకపోయినా వాయిదాలు వేసుకుంటూ ఉండు అంటున్నారు ఆచార్యులవారు.

**మనం చేసే పనులకు మనం మాట్లాడే మాటలకు**
**మనకు వచ్చే ఆలోచనలకు కూడా మనం భగవంతుడికి**
**సమాధానం చెప్పాలి. భగవంతుడు కర్మసాక్షి.**



మీకు ఏదైనా కోపం వచ్చింది అనుకోండి వెంటనే తిట్టవద్దు రేపు తిడదాము అనుకోండి కొంచెం వేగం తగ్గుతుంది అంటున్నారు. ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే post-pone చేసుకో అంటున్నారు. మీకు అర్థం అవుతోందా? ఇవాళ మీ కోడలిని పట్టుకుని తిట్టేయాలి అనిపించింది అనుకోండి, రేపు తిడదాము అనుకోండి, రేపటికి కొంచెం వేగం తగ్గుతుంది, కొంచెం పలచబడుతుంది. అప్పుడు మనస్సు నిదానంలోకి వస్తుంది. ఆచార్యుల వారు ఏమంటున్నారు అంటే మీకు ఏదైనా ఉద్రేకం వస్తే అది వెంటనే కంట్రోల్ చేసుకునే శక్తి కనుక మీకు లేకపోతే కొంచెం వాయిదాలు వెయ్యడం నేర్చుకోండి అంటున్నారు, postpone చెయ్యమంటున్నారు ఆచార్యులవారు. అంటే ఏదో ఒక రకంగా చెడ్డ భావనల నుండి మనలని బయటకి తీసుకుని రావడం కోసం, మనలని తరింపచేయడం కోసం, మనలని ఉద్ధరింపచెయ్యడం కోసం ఆచార్యులవారు పడే తపన అది.

రాగ ద్వేషాల దగ్గర చెడ్డ ఏమిటి అంటే, రాగం ఉన్నా మనస్సు బాహ్యాముఖానికి వెళ్ళిపోతుంది. ద్వేషం ఉన్నా మనస్సు బాహ్యాముఖానికి వెళ్ళిపోతుంది. ఈ రాగ ద్వేషాలు ఎక్కడైతే ఎక్కువగా ఉన్నాయో, ఆ జీవుడు హృదయంలో ప్రవేశించడానికి అవకాశం లేదు. ఇవి తగ్గించుకుంటే ఆ జీవుడు హృదయాకారం చెందుతాడు, ఆత్మాకారం చెందుతాడు, బ్రాహ్మీస్థితి పొందుతాడు, ఆనందంలో ఊగిసలాడుతాడు. ఈ చిల్లర సుఖాలు విడిచి పెట్టకపోతే నీ హృదయంలో ఉన్న అనంతమైన సుఖం నీకు దొరకదు. కొంతమందికి పని పాటా ఉండదు వాడి అహంకారాన్ని చావకుండా అలా నిలబెట్టుకుందాం అని చూస్తూ ఉంటాడు. అదే బ్రతుకు అనుకుంటారు వాళ్ళు. కొంతమంది మొక్కలకి నీళ్ళు పోసినట్టు వాళ్ళ అజ్ఞానానికి నీళ్ళు పోసుకోవడం, వాళ్ళ అహంకారానికి నీళ్ళు పోసుకోవడం, అది చచ్చిపోకుండా చూసుకోవడం, అంతకంటే పనిపాటా ఏమీ ఉండదు. వాళ్ళు మాట్లాడే మాటల్లో అహంకారం ఉంటుంది, వాళ్ళు చేసే పనుల్లో అహంకారం ఉంటుంది, వాళ్ళకొచ్చే తలంపులో అహంకారం ఉంటుంది, అహంకారాన్ని బ్రతికించుకోవడం కోసమే వాళ్ళు జీవితం పొడవునా ప్రయత్నం చేస్తారు కానీ దానిని తొలగించుకోవడానికి ప్రయత్నం ఏమీ చెయ్యరు. అందుచేత వాళ్ళకి ఆత్మశాంతి కానీ, ఆత్మసుఖం కానీ, మోక్షశాంతి కానీ పొందే

అర్హత, యోగ్యత లేదు. ఈ చిల్లర గొడవలు వదిలేయండి, ఎవరో ఒకరు మిమ్మల్ని విమర్శిస్తూ ఉంటారు. విమర్శిస్తే మీరు బాధపడకండి. ఎవరో మిమ్మల్ని పొగుడుతూ ఉంటారు, పొగుడుతూ ఉంటే పొంగిపోకండి. బయట ఉన్న చిల్లర గొడవలు మీరు వదలకపోతే అసలు వస్తువు మీకు దొరకదు, యదార్థ వస్తువు మీకు దొరకదు. వాస్తవమైన స్థితి, ఆ రియల్ స్టేట్, eternal స్టేట్ మీరు పొందలేరు. మీరు బయటి గొడవలు కొంచెం వదులుకోండి అంటే పని విడిచి పెట్టమని కాదు. మిమ్మల్ని పొగిడేవాళ్ళు ఉంటారు, మిమ్మల్ని విమర్శించే వాళ్ళు ఉంటారు, ఆ బయట గొడవలు, చిన్న చిన్న pleasures వదులుకోండి. మీ చేతిలో ఉన్న ఇత్తడిని బయటకి విసిరేయకపోతే మీ హృదయంలో ఉన్న బంగారం మీకు దొరకదు. ఆ బంగారం కోసం మీ చేతిలో ఉన్న ఇత్తడి బయట పడేయండి. అదేవిధంగా మీ హృదయంలో ఉన్న బంగారం లాంటి సుఖాన్ని పట్టుకోవడం కోసం బాహ్యంగా ఉన్న గొడవలు కొన్ని తగ్గించుకోండి.

వ్యర్థమైన చింతలు, వ్యర్థమైన కర్మలు, వ్యర్థమైన కోరికలు వద్దు. Observe silence అంటున్నారు ఆచార్యులవారు. ఉపయోగం లేని మాటలు మాట్లాడకు. ఏకాంతవాసం అలవాటు చేసుకో. మీకు ఏదైనా పని ఉంటే ఆ పని చేసుకోండి పని మానేసి వెళ్లి ఊరి మీద పడవద్దు అంటున్నారు ఆచార్యులవారు. ఇక్కడ ఆచార్యులవారుఏమంటున్నారు అంటే మీకు ఏవైనా చెడు స్నేహాలు ఉన్నాయి అనుకోండి, ఆధ్యాత్మికంగా, నైతికంగా మీరు పాడు అయ్యిపోయే స్నేహాలు ఒకవేళ ఉన్నాయి అనుకోండి, ఆ చెడ్డ స్నేహాలు వదిలేసి మంచి స్నేహాలు కనుక చేస్తే, ఆ చెడ్డ స్నేహాలు ముందు దూరం అయిపోతాయి. నెమ్మదిగా తరువాత మంచి స్నేహాలు పెంచుకుని అప్పుడు ఏకాంతవాసాన్ని ఎంజాయ్ చెయ్యవచ్చు అంటున్నారు. మీరు ఏది మాట్లాడినా సాఫ్ట్‌గా మాట్లాడండి, స్వీట్‌గా మాట్లాడండి, కఠినంగా మాట్లాడవద్దు అంటున్నారు ఆచార్యులవారు. మాట కూడా ఎలా మాట్లాడాలో చెబుతున్నారు సాఫ్ట్‌గా ఉండాలి అంటున్నారు, స్వీట్‌గా ఉండాలి అంటున్నారు. మనం ఏమి మాట్లాడు తున్నామో అసలు ముందు మనకి తెలియాలి. మనకే తెలియకుండా వినేవాళ్ళకిఏమి తెలుస్తుంది? నేను ఏమి చెబుతున్నానో దానికి సంబంధించిన అనుభవం నాకు కొంత

ఉంటే మీకు తెలుస్తుంది. ఆ చెప్పే మాటకి సంబంధించిన అనుభవం నాకే లేనప్పుడు మీకు అసలే తెలియదు. అందుచేత మీరు ఏదైతే చెప్పదలచుకున్నారో అది సాఫ్ట్‌గా చెప్పండి, స్వీట్‌గా చెప్పండి. మీరు ఏదో గొప్పల కోసం చెప్పకండి. ఎదుటివాళ్లకి అర్థం అయ్యేటట్టు చెప్పండి. ఇతరుల పట్ల మీ ప్రవర్తన నాగరికంగా ఉండాలి, మర్యాద పూర్వకంగా ఉండాలి. సున్నితంగా ఉండాలి, మృదువుగా ఉండాలి కానీ రఫ్‌గా ఉండకూడదు అంటున్నారు ఆచార్యులవారు. అంటే ఇతరుల పట్ల నీ behaviour కనుక రూడ్‌గా ఉంటే, దాని వల్ల కొత్త సంస్కారాలు ఏర్పడతాయి, దానివల్ల మైండ్ డస్ట్ తోటి నిండిపోతుంది. ఎదుటివాడు ఉద్రేకంగా మాట్లాడినా మీరు ఉద్రేకంగా మాట్లాడక్కర్లేదు. ఎవరికైనా కాన్సర్ వచ్చింది అనుకోండి, ఆ కాన్సర్ మనకి కూడా వస్తే బాగుండును అని మనం అనుకుంటామా? అనుకోము. ఎదుటి మనిషికి ఏదైనా వికారం ఉండవచ్చు, ఆ వికారం చూసి మీరు ఉద్రేక పడకండి. మీ యొక్క మెంటల్ డిసిప్లిన్ మీరు విడిచి పెట్టకండి.

ఆచార్యులవారు ఏమి చెబుతున్నారు అంటే మీకు ఎంత ధనం ఉన్నా, మీకు ఎంత అధికారం ఉన్నా, మీకు ఎంత విద్య ఉన్నా మీకు మెంటల్ discipline కనుక లేకపోతే మీరు సుఖపడరు, మీకు శాంతి లేదు అంటున్నారు. Mental discipline చాలా ముఖ్యం. మీకు మానసికమైనటువంటి క్రమశిక్షణ, జీవితంలో క్రమశిక్షణ చాలా ముఖ్యం. మీ మనస్సులో కనుక క్రమశిక్షణ లేకపోతే మీ ధనం కానీ, మీ చదువు కానీ, మీ గౌరవం కానీ, మీ హోదా కానీ మీకు సుఖాన్ని తీసుకురావు. అవి అన్నీ మీకు ఉంటే ఉండవచ్చు కానీ అంతమాత్రం చేత మీకు సుఖం రాదు. అన్నిటికంటే discipline ముఖ్యం. మీకు ధనం ఉండవచ్చు, మీకు చదువు ఉండవచ్చు, మీకు ఏదైనా అధికారం ఉండవచ్చు, ఇవన్నీ చూసి మీరు గర్వపడకండి. ఇవన్నీ కాలప్రవాహంలో కొట్టుకుపోతాయి. కానీ అవన్నీ కూడా మీ మనస్సులో ముద్రలు వేసి వెళ్ళిపోతాయి, ఈ ముద్రలు మీ పునర్జన్మకి కారణం అవుతాయి. ఎదుటి వాళ్ళు ఎవరైనా ఉద్రేకపడి మిమ్మల్ని విమర్శించినా మళ్ళీ మీరు తిరిగి విమర్శించవలసిన పని ఏమీ లేదు. ఎవరైనా మిమ్మల్ని రెచ్చగొడుతూ ఉంటే రాముడిని జ్ఞాపకం పెట్టుకోండి అంటున్నారు ఆచార్యులవారు. అంటే బాహ్యంగా ఎవరైనా మిమ్మల్ని ఇబ్బంది పెట్టె పరిస్థితులు

తెచ్చినప్పటికీ మీరు కంగారు పడకండి రాముడి రూపాన్ని ధ్యానం చేసుకోండి, రాముడి యొక్క నామాన్ని స్మరించుకోండి, ఆయన క్షమా స్వరూపుడు, అప్పుడు మీ మనస్సు చల్లబడుతుంది అంటున్నారు.

ఆచార్యులవారు ఏమని చెబుతున్నారు అంటే మీరు అన్నం తినేటప్పుడు మీ మనస్సు చెప్పినట్టు తినకండి, మీ శరీరం చెప్పినట్టు తినండి అంటున్నారు. అన్నం తినేటప్పుడు కూడా ఆచార్యులవారు ఎలా తినాలో చెబుతున్నారు. మీరు అన్నం తినేటప్పుడు మీ పొట్ట చెబుతూ ఉంటుంది సరిపోయింది అని, కానీ మీ మనస్సు ఏమి చేస్తుంది అంటే తినేయ్ అని చెబుతుంది. పొట్ట సరిపోతుంది అని చెప్పినప్పుడు విని మనం అక్కడకి ఆపు చేసేయాలి. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉంటే రోగాలు తగ్గుతాయి. రోగాలు కనుక తగ్గితే నీ మనస్సు నిదానంగా ఉంటుంది, నీ మనస్సు స్టడీగా ఉంటుంది. అంటే శరీరం యొక్క ప్రభావం మనస్సు మీద ఎక్కువగా ఉంటుంది. శారీరక ఆరోగ్యానికి, మానసిక ఆరోగ్యానికి తేడా ఉంది. మనస్సులో ఆరోగ్యం చెడిపోతే దాని ప్రభావం శరీరం మీద పడిపోతుంది. శరీరంలో ఆరోగ్యం చెడిపోతే దాని ప్రభావం ఎక్కడ పడుతుంది? మనస్సు మీద పడిపోతుంది. అందుచేత శరీరాన్ని, మనస్సుని ఆరోగ్యంగా ఉంచుకుని నీ కాలాన్ని పాడుచేసుకోకుండా కాలాన్ని సద్వినియోగం చేసుకుంటే నీకు బ్రహ్మానుభవం ఇక్కడే చిక్కుతుంది అంటున్నారు ఆచార్యులవారు. అన్ని నియమాలలోకి ఆహారనియమం చాలా ముఖ్యమైనది అని రమణస్వామి చెప్పారు. మీరు బాహ్యకారణాల వల్ల ఏ సంతోషం అయితే పొందుతున్నారో, ఆ సంతోషం ఏనాటికి అయినా విషం కింద మారిపోతుంది ఇది జ్ఞాపకం పెట్టుకోండి అంటున్నారు ఆచార్యులవారు. ఈ విషయం మీకు అర్థం అయ్యేటట్టు చెప్పడానికి మీ గ్రామంలో ఎవరూ లేరా అని అడుగుతున్నారు. ఇది డేంజరస్ అంటున్నారు. అంటే బాహ్యకారణాల వల్ల ఏ సంతోషం అయితే నువ్వు పొందుతున్నావో, అది ఎప్పటికైనా విషం కింద మారడమే కాకుండా భవిష్యత్ జన్మలలో అవే ప్రమాద సూచికలు, ఎప్పటికైనా నిన్ను ప్రమాదంలో పడేసేవి అవే అంటున్నారు ఆచార్యులవారు.

నువ్వు దుర్యోధనుడి కంటే గొప్పవాడివి కాదు, రావణాసురుడి కంటే గొప్పవాడవు

కాదు. నువ్వు కనుక దుర్వాసనలని పెంచుకుంటే దుర్యోధనుడు ఏవిధంగా అయ్యిపోయాడో, రావణాసురుడు ఏవిధంగా అయ్యిపోయాడో నువ్వు కూడా అదేవిధంగా అయ్యిపోతావు. అందుచేత వాళ్ళని కూడా ఎప్పుడైనా తలపెట్టుకోమంటున్నారు ఆచార్యులవారు. ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే దుర్యోధనుడు, రావణాసురుడు కూడా రాజులే. అంతటి మహాచక్రవర్తులే ఎందుకు పనికిరాకుండా అయిపోయారు. దుర్వాసనలు ఉంటే వాళ్ళు ఎలా తయారు అయ్యారో మనం కూడా అలా తయారు అవుతాం, వాళ్లకి ఏ గతి పట్టిందో మనకి కూడా అదే గతి పడుతుంది అంతకంటే మనం ఏమీ గొప్పవాళ్ళం కాదు. అంటే వాళ్ళు ఏ గుణాల వల్ల పతనం అయ్యిపోయారో ఆ గుణం మనలో ఉంటే మనం కూడా అలా పతనం అయ్యిపోతాం అని విషయం తెలుసుకోవడం కోసం వాళ్ళని జ్ఞాపకం పెట్టుకోమన్నారు. అర్థమవుతోందా మీకు? ఈ ప్రపంచంలో ఏది permanent కాదు. ఏ వస్తువుని చూసి నువ్వు మోహపడకు. ఏది స్థిరంగా ఉండదు, అందుచేత వీటిని చూసి నువ్వు మోహపడవద్దు.

నువ్వు ఎంతోకొంత వైరాగ్యం అనే సంపదని కూడా సంపాదించుకో, మీరు రూపాయలు సంపాదించుకుంటున్నారు, గౌరవాలు సంపాదించుకుంటున్నారు, మీకు అర్థం అవుతుందా? కొంతమంది మాకు పలుకుబడి ఉంది అంటారు. ఈ పలుకుబడి ఎలా సంపాదించుకుంటున్నారో, రూపాయలు ఎలా సంపాదించుకుంటున్నారో, గౌరవాలు ఎలా సంపాదించుకుంటున్నారో, వైరాగ్యం అనే సంపదని కూడా సంపాదించుకో. వైరాగ్యమే నిజమైన సంపద. అంటే నీ దేహం మరణించిన తరువాత కూడా నీ కూడా వచ్చే సంపద అది ఒకటి మాత్రమే, అందుచేత నీ మరణానంతరం ఏదైతే వస్తుందో అది కూడా సంపాదించుకో, దేవుడిబ్యాంకులో కూడా కొన్ని రూపాయలు వేసుకో అంటున్నారు ఆచార్యులవారు. ఆంధ్రాబ్యాంకు, ఇండియన్‌బ్యాంకు, స్టేట్‌బ్యాంకులోనే కాకుండా దేవుడిబ్యాంకులో కూడా నాలుగురూపాయలు వేసుకో నువ్వు. దేవుడిబ్యాంకులో నీకు ఏదైనా నాలుగురూపాయలు ఉంటే చనిపోయిన తరువాత మారతాయి అవి. నువ్వు చనిపోయిన తరువాత భీమవరంబ్యాంకులో ఉన్నది ఏమీ మారదు, దేవుడిబ్యాంకులో నాలుగు

రూపాయలు ఉంటే అవి మారతాయి.  అందుచేత నువ్వు వైరాగ్యసంపదని కూడా పెంచుకో, వైరాగ్యం కూడా ధనం తోటి సమానం, అది నీ మరణాంతరం నీ కూడా వస్తుంది, నిన్ను సుఖపెడుతుంది.  అందుచేత వైరాగ్యాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ప్రయత్నం చెయ్యి. వైరాగ్యం లేకపోతే నీకు జ్ఞానం సంపాదించాలి అన్న కాంక్ష కలుగదు, మంచి మంచి గుణాలు సంపాదించాలి అనే కాంక్ష కలుగదు, సహృదయం సంపాదించాలి అనే కాంక్ష కలుగదు.  నీకు వైరాగ్యం కనుక ఉంటే సహృదయం వస్తుంది, నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడు నీకు వ్యక్తం అవుతాడు.

ఆచార్యులు వారు అంటున్నారు ఇక్కడ మీకు ఏవైనా స్నేహాలు ఉన్నాయి అనుకోండి, స్నేహాలు కూడా ఎక్కువ చేయవద్దు, స్నేహాల వల్ల మత్తు వస్తుంది అంటున్నారు.  సారా తాగడం వలన ఎటువంటి మత్తు వస్తుందో అలాగే స్నేహాలు వలన కూడా మత్తు వస్తుంది. కొంతమంది ఏమి చేస్తారు అంటే సాధన మానేసి ఆ జత గాళ్ళని వేసుకుని ఉదయం నుంచి సాయంత్రం దాకా ఎక్కడెక్కడో కూర్చుంటారు.  మీకు అర్థం అవుతోందా?  వీడి వల్ల వాడికి ఉపకారం లేదు, వాడి వల్ల వీడికి ఉపకారం లేదు, ఏదో చెట్టు కింద కూర్చుని, పనికిరాని గొడవలు అన్నీ చెప్పుకుంటూ, useless గొడవలు చెప్పుకుంటూ అలా కాలక్షేపం చేసేస్తారు. సారా ఎటువంటి మత్తు ఇస్తుందో మీ స్నేహాలు కూడా అటువంటి మత్తు ఇస్తాయి.  తగు మాత్రంగా స్నేహాలు చెయ్యాలి కానీ అతిగా చేస్తే మీ కాలం వృథా అయ్యిపోతుంది.  ఈలోపులో మీకు చావు వచ్చేస్తుంది.  అందుచేత స్నేహాలు కూడా తగు మాత్రంగా చెయ్యి కానీ అతిగా



**నీవు భగవంతుడిని ఆరాధించగా ఆరాధించగా నీ భక్తి నిజమైతే నీ ఒక్కడి కోసమే భగవంతుడు గురురూపంలో వస్తాడు. భక్తుడి స్మరణలో ఉన్న ఔన్నత్యం అటువంటిది. నీ శరణాగతి నిజమైతే ఆయన అనుగ్రహం వచ్చి నీ అహంభావనను ముంచేస్తుంది.**

చెయ్యవద్దు అంటున్నారు ఆచార్యులవారు.

మీలో కొంతమందికి సహజంగా కఠినత్వం ఉంటుంది. లోకంలో కొంతమంది రాతి మనుషులు ఉంటారు. రమణ మహర్షి గారు అనేవారు ఈ రాళ్ల మనుషులకి రాళ్ల దేవుళ్ళు అవసరం అని. వారు మనిషిలో ఉన్న దేవుడిని చూడలేరు, రాతిలో ఉన్న దేవుడిని చూస్తారు. వాళ్లకి మానవత్వం కానీ, మనిషి మీద గౌరవం కానీ ఉండదు. వాళ్ళది రాతి మనస్సు. అటువంటి రాతి మనస్సు ఉన్నవాళ్ళకి రాళ్ల దేవుళ్ళు బాగానే ఉంటారు. నువ్వు మనిషిలో దేవుడిని చూడు. రాతి మనస్సు ఉన్నవాళ్ళు రాతి దేవుళ్ళని అలా చూస్తూ ఉంటారు, రాతి దేవుళ్ళు చుట్టూ తిరుగుతూ ఉంటారు. పోనీ తిరగనివ్వండి రాతి మనస్సు ఉన్న వాళ్ళకి ఆ దేవుళ్ళు అవసరమే. సహజంగా కొంతమందికి క్రూరత్వం ఉంటుంది. ఎదుటివాళ్ళు ఏదైనా బాధ పడుతున్నారు అనుకోండి మాటవరసకి, వాళ్ళు బాధపడితే వీళ్ళకి ఏమీ కలిసి రాదు, కానీ వీళ్ళకి మటుకు పాయసం తాగినట్టు ఉంటుంది. అటువంటి దుష్ట బుద్ధి, క్రూర బుద్ధి కొంతమందికి ఉంటుంది. ఎదుటివాళ్ళు బాధపడుతుంటే ఆ బాధని చూసి సంతోషించేవాళ్ళు ఉంటారు. అటువంటి మనస్సు మీలో ఎవరికీ లేదు అనుకోండి, ఒకవేళ ఉంటే మీరు ప్రేమని, కరుణని, మెర్సీని అలవాటు చేసుకుని, ప్రాక్టీస్ చేసుకోండి అంటున్నారు ఆచార్యులవారు. ఆ క్రూరత్వం కనుక మీలో ఉంటే అప్పుడు దయ, కరుణ, affection, love, mercy వాటిని ప్రాక్టీస్ చేసి ఆ క్రూరత్వం తొలగించుకోండి. కొంతమందికి మాటల్లోనే cruelty ఉంటుంది. మనం ఎదుటివాళ్ళకి భౌతికంగా ఏమీ సహాయం చెయ్యలేకపోవచ్చు, మాటల ద్వారా బాధపెట్టకూడదు. అందరికీ ధనం ఉండదు సహాయం చెయ్యడానికి, మనం మంచి మాటలు మాట్లాడడానికి డబ్బు ఖర్చు ఏమీ లేదు కదా, మనం సాఫ్ట్‌గా మాట్లాడడానికి, స్వీట్‌గా మాట్లాడడానికి ఏమీ పెట్టుబడి పెట్టక్కర్లేదు. కొంతమంది అలా స్వీట్‌గా కూడా మాట్లాడరు. ఎందుచేత అంటే వాళ్ళ స్వభావంలో క్రూరత్వం ఉంది. అటువంటి క్రూరత్వం పోవాలి అంటే మీరు loveని ప్రాక్టీస్ చెయ్యండి, mercyని ప్రాక్టీస్ చెయ్యండి.

జీవుడు వేరు, దేహం వేరు. ఇది అది ఒక్కటే అనే ధోరణిలో పడకండి. ఈ దేహం

నివాసయోగ్యంగా ఉన్నంత కాలం ఆ జీవుడు ఉంటాడు. ఈ దేహం నివాసయోగ్యం కానప్పుడు ఆ జీవుడు దేహం విడిచిపెట్టి బయటకి వెళ్ళిపోతాడు. జీవుడు వేరు, దేహం వేరు అవి రెండు ఒక్కటే అని మటుకు మీరు అనుకోకండి. అవి రెండు ఒక్కటే అని అనుకుంటే మీకు వివేకం లేదు, బుద్ధి లేదు అని అర్థం అంటున్నారు ఆచార్యులవారు. దేహం పుడుతుంది, పెరుగుతుంది, తరువాత మరణిస్తుంది. కానీ జీవుడు మటుకు దేహం నశించినా వాడు అలాగే ఉంటాడు. జీవుడు బ్రహ్మంలో ఐక్యం అయ్యేవరకు వాడు దేహాన్ని తొడుగుతూనే ఉంటాడు. అంటే జీవుడు వేరు, దేహం వేరు, దేహం నశించినంత మాత్రం చేత జీవుడు నశించడు. భౌతికమైన అగ్ని వల్ల దేహం కాలిపోతుంది, జ్ఞానాగ్ని వలన జీవుడు కాలిపోతాడు. అంటే దేహం వేరు, జీవుడు వేరు. అవి రెండు కలగాపులగం చేసుకోవద్దు, కంగారు పడకండి, మీ తెలివితేటలు ఉపయోగించుకోండి, మీ బుద్ధిని ఉపయోగించుకోండి, అది వేరు, ఇది వేరు. ఇది అది అవ్వదు, అది ఇది అవ్వదు అంటున్నారు. జీవుడు జీవుడే, దేహం దేహమే. మీరు దేహానికి స్నానం చేయిస్తున్నారు, శుభ్రంగా చేస్తున్నారు, ఏదో అన్నం పెడుతున్నారు. మీరు ఎంతసేపు 24 గంటలు దేహం గురించే ఆలోచిస్తున్నారు కానీ జీవుడు ఎంతవరకు బాగుపడ్డాడు? ఎంతవరకు పవిత్రుడు అయ్యాడు? బ్రహ్మానుభవం పొందడం కోసం ఎంతవరకు యోగ్యత సంపాదించాడు అని ఆ జీవుడు గురించి ఎప్పుడైనా ఒక ఐదు నిమిషాలు నిలబడి ఆలోచించారా అంటున్నారు ఆచార్యులవారు. ఎంత ప్రేమగా చెప్పారో చూడండి, ఇలా ఆచార్యులు తప్పించి ఎవరు చెబుతారు? ఎవరికి కావాలి ఇది. మీ అమ్మగారు, మీ నాన్నగారు ఉన్నారు అంటే ఏదో ఒక పూట అన్నం పెడతారు, నాలుగు చీరలు ఇస్తారు మీకు కొంత ధనం ఇస్తారు కానీ ఆచార్యులు తప్పించి ఇలా చెప్పేవారు ఎవరుంటారు మీకు? జగద్గురువు తప్పించి, జ్ఞాని తప్పించి ఇంత విపులంగా, వివరంగా మీరు బాగుపడాలని తపన తోటి చెప్పేవారు ఎవరుంటారు మీకు?

ఆచార్యులవారు self-effort సెల్ఫ్ఎఫర్టే, divine grace డివైన్గ్రేసే అంటున్నారు. అంటే స్వప్రయత్నం స్వప్రయత్నమే, దేవుడిఅనుగ్రహం దేవుడిఅనుగ్రహమే. దేవుడి అనుగ్రహం

తీసుకుని వచ్చి ప్రయత్నంలో పెట్టకూడదు, ప్రయత్నాన్ని తీసుకుని వెళ్లి దేవుడి అనుగ్రహంలో పెట్టకూడదు. మీకు మోక్షం కావాలి అంటే రెండూ అవసరమే. దేవుడి అనుగ్రహం ఉంది కదా నేనేమి ప్రయత్నం చెయ్యక్కర్లేదు అనుకోకూడదు. మీకు అర్థం అవుతోందా? మేమేదో ప్రయత్నం చేస్తాం, మా సాధన ఏదో మేము చేసుకుంటాం, మా ముక్కులో గాలి మేము చూసుకుంటాం, దేవుడి గొడవ అక్కర్లేకుండా మేము మోక్షాన్ని పొందుతాం అనుకొంటున్నారు. ముక్కులో గాలి చూసుకుంటున్నారు, ఇంక దేవుడు అక్కర్లేదు, వీళ్ళకి మోక్షం వచ్చేస్తుంది. ముక్కులో గాలి చూసుకుంటే వచ్చేస్తుందా? లోపల కంట్రోలర్ ఒకడు ఉన్నాడు కదా అంటే ఆ కంట్రోలర్‌కి రూపం లేదు, రూపం లేదు కాబట్టి లేడు అనుకుంటున్నాం, ఇదే మహా మాయ. మనది చర్మ దృష్టి, రూప దృష్టి. మన హృదయంలో కంట్రోలర్ ఉన్నాడు కానీ వాడికి రూపం లేదు. రూపం లేదు కాబట్టి రూప దృష్టి ఉన్న మనకి ఆ రూపం లేనివాడు కనపడడం లేదు. మీకు కుడి కన్ను కావాలా? ఎడమ కన్ను కావాలా అంటే మాకు కుడి కన్ను అక్కర్లేదు అండి, ఎడమ కన్ను ఉంటే సరిపోతుంది అని ఎవరైనా అంటారా? మాకు రెండు కళ్లు కావాలి అంటారు. అంటే ఇక్కడ ఆచార్యుల వారు ఏమని చెబుతున్నారు అంటే రెండూ అవసరమే. అంటే నీ ప్రయత్నం ఉండాలి, దేవుడి అనుగ్రహం ఉండాలి. నీ ప్రయత్నం చేసే పని నీ ప్రయత్నం చేస్తుంది, దేవుడి అనుగ్రహం చేసే పని దేవుడి అనుగ్రహం చేస్తుంది. దేవుడి అనుగ్రహం ఉంది కదా అని నీ ప్రయత్నం విడిచిపెట్టకూడదు. అంటే నీకు మోక్షానుభవం కలగడం కోసం, మోక్షసుఖం కలగడం కోసం, రెండూ అవసరం. స్వప్రయత్నం అవసరమే, దేవుడి అనుగ్రహం కూడా అవసరమే. దీని ప్లేస్ లో దానిని పెట్టకు, దాని ప్లేస్‌లో దీనిని పెట్టకు అంటున్నారు ఆచార్యులవారు, దేనికదే అంటున్నారు. దానికుండే ప్రాముఖ్యత దానికుంది, దీనికుండే ప్రాముఖ్యత దీనికి ఉంది, అందుచేత ఏదో ఒక దానిని కించపరచకు నువ్వు, రెండు సమానంగా చూసుకో, నువ్వు ఆత్మవిశ్వాసం తోటి ఉండు. నువ్వు హృదయపూర్వకంగా, dedicatedగా, devotedగా త్రికరణ శుద్ధిగా నువ్వు చేసే ప్రయత్నం చెయ్యి. నువ్వు చేసే ప్రయత్నంలో బద్ధకించకు, సోమరితనానికి గురి అవ్వకు. బలహీనులకి, బద్ధకస్తులకి ఆత్మజ్ఞానం కలగదు. నీ ప్రయత్నంలో మటుకు లోటు వద్దు. నీ ప్రయత్నం చేస్తూనే ఉండు. నీ ప్రయత్నం ఏదో నువ్వు చెయ్యి, భగవంతుడి కృప

ఏదో ఉంటుంది. నీ రెండు కళ్లు నువ్వు ఎలా చూసుకుంటున్నావో ఇవి రెండు అలా సమానంగా చూసుకుని ప్రయత్నం చేసి తరించవయ్యా అంటున్నారు స్వాములవారు. నువ్వు ప్రశాంతంగా కూర్చో, ఏకాంతంగా కూర్చో, ఉద్రేక పడకు, నీలో ఏమి దుర్వాసనలు ఉన్నాయో జాగ్రత్తగా observe చేసుకో, కొంతమంది ఎదుటివాళ్ళలో ఉన్న దుర్గుణాలు కనిపెట్టడానికి టైం అంతా వేస్ట్ చేస్తారు. మీకు అర్థం అవుతోందా? ఎదుటివాడిలో దుర్గుణాలు ఉంటే నీకు నష్టం ఏమిటి అయ్యా? పాడైతే వాడు పాడు అవుతాడు కానీ నువ్వు పాడు అవ్వవు. నువ్వు ప్రశాంతంగా కూర్చుని, ఏకాంతంగా కూర్చుని, నీ హృదయంలో దుర్గుణాలు ఏమున్నాయో చూసుకొని వాటిని తొలగించుకోవడానికి ప్రయత్నం చెయ్యి కానీ ఏకాంతంగా కూర్చుని ఇతరులలో ఏమి దుర్గుణాలు ఉన్నాయో కనిపెట్టడం వలన నువ్వు సాధించేది ఏమీ లేదు. నీలో ఉన్న ఏ దుర్గుణం నీకు పునర్జన్మ హేతువు అవుతోందో అది చూసుకో అంతేగాని ఎదుటివాళ్ళలో దుర్గుణం కనిపెట్టడం వలన నీకు కలిసివచ్చేది లేదు. నీలో ఉన్న దుర్గుణాన్ని కనిపెట్టి దానిని remove చేసుకోవడానికి, దానిని eliminate చెయ్యడానికి నువ్వు ప్రయత్నం చెయ్యి అంటున్నారు ఆచార్యులవారు.

సాధన అంటే ముందు ప్రశాంతంగా కూర్చో, కంగారు పడకు. ఎవరూ నిన్ను తరుముకుని రావడం లేదు. కొంతమంది మాట్లాడుతూ ఉంటే ఎవరో తరుముకు వచ్చినట్టు మాట్లాడుతారు. ఏదైనా పని చేసినా తరుముకు వచ్చినట్టు పని చేస్తారు. అలా చెయ్యకండి, ప్రశాంతంగా ఉండండి, నిగ్రహంగా ఉండండి, చేసే పని ఏకాగ్రంగా చెయ్యండి, భక్తితో చెయ్యండి, ప్రేమతో చెయ్యండి, ప్రీతితో చెయ్యండి, ఎవరో తరుముకు వచ్చినట్టు చెయ్యవద్దు. అందుచేత నీ హృదయంలో ఉన్న దుర్గుణాలని నువ్వు చూసుకో, చూసుకుని వాటిని తొలగించుకోవడానికి ప్రయత్నం చెయ్యి, అదే సాధన. నువ్వు ఎప్పుడైతే తొలగించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నావో అప్పుడు దేవుడి అనుగ్రహం కూడా నీకు వస్తుంది. దాని సహాయంతో, ఆ దురలవాట్లలోంచి, ఆ దుర్వాసనలలోంచి, ఆ దుష్ట ప్రవర్తనలోంచి నువ్వు బయట పడతావు. అప్పుడు మోక్షానికి అర్హత, యోగ్యత నువ్వు సంపాదిస్తావు. ఇతరుల పట్ల అసహనం పెంచుకోకండి. కొంతమంది ఎదుటి మనిషిని చూస్తే అసహ్యించుకుంటారు,

అది చాలా చెడ్డ అంటున్నారు ఆచార్యులస్వామివారు. వాళ్ళలో కూడా విష్ణువును చూడు, నీ హృదయంలో ఎవడైతే ఉన్నాడో వాడి హృదయంలో కూడా వాడే ఉన్నాడు. వాడిలో కూడా విష్ణువుని చూడు. తోటి మానవుడిని చూసి అసహ్యించుకోకు. నీ హృదయంలో ఉన్నవాడు అక్కడ కూడా ఉన్నాడు. అక్కడ కూడా విష్ణువు ఉన్నాడు!

మీ ఇంటికి ఎవరైనా బంధువులు వచ్చారు అనుకో ఆదరణగా చూడు, మజ్జిగ అన్నం పెట్టినా, గంజి పెట్టినా నీకు ఉన్నది ఏదో నువ్వు పెడతావు. నీ మాటలో కానీ, ప్రవర్తనలో కానీ అనాదరణ పనికిరాదు. గర్వంగా చూడకు, అనాదరణగా చూడకు. నీకు ఉన్నదేదో నువ్వు పెడతావు, కానీ ఆదరణ విషయంలో, మర్యాద విషయంలో ఏమీ లోపం చెయ్యవలసిన పని నీకు లేదు. దానివల్ల కూడా నీ మైండ్ బాగుపడుతుంది. ఆచార్యులవారు అంటున్నారు. Do everything with care. పెద్ద పెద్ద పనులు అందరూ శ్రద్ధగానే చేస్తారు, చిన్న చిన్నపనులు కూడా శ్రద్ధగా చెయ్యడం నేర్చుకో, ఏ చిన్న పని అయినా సరే శ్రద్ధగా చెయ్యడం నేర్చుకో, శ్రద్ధగా చెయ్యడం నేర్చుకుంటే నీ మనస్సు బాగుపడుతుంది, రాబోయే ప్రమాదాల లోంచి బయటపడతావు అంటున్నారు ఆచార్యులవారు. ఒకవేళ నీలో ఏవైనా దుర్గుణాలు ఉన్నాయి అనుకో, ఆ దుర్గుణాలు వల్ల వచ్చే చెడ్డ ఏదో ముందు ఊహించుకో. ఈ దుర్గుణాలు వలన ఈ చెడ్డ వస్తుంది కదా అని ఊహించుకుని ఆ దుర్గుణాలు లోంచి బయటకి రావడానికి ప్రయత్నం చెయ్యి. లేకపోతే ఈ జన్మలో కాకపోయినా రాబోయేజన్మలో అయినా దానివల్ల వచ్చే bad effects ఉండనే ఉంటాయి. అందుచేత అటువంటి విషయాలలో నువ్వు జాగ్రత్తగా ఉండు. ఆత్మ జ్ఞానాన్ని, ఆత్మ సంపదని, ఆత్మ విద్యని సంపాదించుకోవడానికి ప్రయత్నం చెయ్యి. O my dear boy, O my dear student. నువ్వు ఆత్మసంపదని, ఆత్మ విద్యని, ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకోవడానికి ప్రయత్నం చెయ్యి. నీ పొట్ట కోసం ఏదో నాలుగు రూపాయలు సంపాదించుకుంటున్నావు, సరే బాగానే ఉంది. ఆత్మజ్ఞానం లేకపోతే మోక్షం రాదు. ఆత్మజ్ఞానం లేకపోతే నీకు శాంతి తెలియదు. అందుచేత ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకోవడానికి నువ్వు ప్రయత్నం చెయ్యి. ఈ లోకంలో అనేక విద్యలు ఉన్నాయి కానీ ఆత్మవిద్యని నేను అని కృష్ణుడు అర్జునుడితోటి చెప్పాడు. ఆత్మ విద్య ద్వారా ఆత్మ

తెలియబడుతుంది. అదే నిజమైన విద్యే. మిగతా విద్యలు అన్నీ కూడా పొట్టకే పరిమితం. అందుచేత ఆత్మవిద్యని సంపాదించుకోవడానికి ప్రయత్నం చెయ్యి. My dear student, My dear boy అంటున్నారు.

ఇక్కడ ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే నువ్వు భౌతిక విద్యలు సంపాదించాలి అనుకో కొంచెం తెలివి కూడా ఉండాలి. ఎకనామిక్స్ చదువుకోవాలి అనుకో కొంత తెలివి ఉండాలి. కెమిస్ట్రీ చదువుకోవాలి అనుకో ఎంతో కొంత తెలివి ఉండాలి. కానీ మీకు భగవంతుడి మీద భక్తి ఉంటే ఆత్మవిద్య వచ్చేస్తుంది. దీనికి ఎక్కువ తెలివి అక్కర్లేదు సామాన్యంగా ఉన్నా సరిపోతుంది అంటున్నారు. ఆత్మ విద్యని నువ్వు సంపాదించుకోవడానికి ప్రయత్నం చెయ్యి. దీనికి భగవంతుడు ఉన్నాడన్న విశ్వాసం ఉంటే సరిపోతుంది. మనస్సు అందులో ఐక్యం అవుతుంది, ఉన్నది అక్కడ ఆత్మజ్ఞానమే. తెలివి అక్కర్లేదు. Averageగా ఉంటే సరిపోతుంది, మీకు జ్ఞానం కలిగిపోతుంది. మన పద్ధతి ఎలా ఉందో ఆచార్యులవారు చెబుతున్నారు. అరణ్యం ఏదైనా అంటుకుంది అనుకోండి, అందులోని జంతువులు ఏమి చేస్తాయి అంటే కంగారుగా అటు ఇటు పరుగెట్టేస్తాయి. ఎలా బయటకు వెళ్ళాలో వాటికి తెలియదు, కంగారుపడి ఎటు పడితే అటు పరిగెట్టేసి వెళ్లి నిప్పులో పడిపోతాయి. మన జీవితాలు కూడా అలాగే ఉన్నాయి అంటున్నారు ఆచార్యులవారు. అంటే మోక్షమార్గం మనకి తెలియడం లేదు, విచారణ చేసే శక్తి లేక కంగారు పడి మళ్ళీ పునర్జన్మకే మనం వెళ్తున్నాం.

మీ హృదయంలో నారాయణుడు ఉన్నాడు, వాడి గురించి కొంచెం తలపెట్టుకోండి. నిన్ను నియమించేవాడు నీ హృదయంలోనే ఉన్నాడు, వాడి గురించి కొంచెం ఆలోచించు, వాడి గురించి ధ్యానం చెయ్యి, వాడి గురించి విచారణ చెయ్యి, నువ్వు కొంచెం అటు

**మనకు కోరికలు, కోపాలు వస్తూ ఉంటాయి.**
**నిరంతరం భగవంతుడిని స్మరించుకోవటం**
**వలన వాటి వేగం తగ్గుతుంది.**



జరుగు, ముల్లంత అయినా అటు జరుగు. వ్యర్థమైన చింతలు, వ్యర్థమైన కర్మలు, వ్యర్థమైన కోరికలు, వ్యర్థమైన తలంపులుతో నీ కాలాన్ని పాడు చేసుకోవద్దు, అవి నీకు ఉపయోగపడవు, నీ కుటుంబానికి ఉపయోగపడవు, సమాజానికి ఉపయోగపడవు. అటువంటి ఆలోచనల యొక్క ప్రవాహంలో నువ్వు కొట్టుకుని పోవద్దు. నీ హృదయంలో ఉన్న సద్వస్తువు గురించి ఆలోచించడం కొంచెం అయినా నేర్చుకో. నీ హృదయంలో ఉన్న పరమేశ్వరుడు గురించి నువ్వు ఆలోచించవు అనుకో, ఆరోజుకారోజు మొద్దు అబ్బాయివి అయిపోతావు. ఆరోజు కారోజు నీకు చైతన్యం పెరగాలి కానీ, నీకు వివేకం పెరగాలి కానీ, నువ్వు మొద్దు అబ్బాయివి అవ్వకూడదు. ఆత్మవిద్య కాని విద్యలు అన్నీ కూడా మంటలో పెట్టిన కట్టెలు లాంటివి. ఇవన్నీ కూడా కాలప్రవాహంలో కొట్టుకుని పోతాయి.

వాల్మీకీ రామాయణంలో అన్నాడు nothing is too heavy for destiny. నీకు అధికారం ఉండవచ్చు, సంపద ఉండవచ్చు అన్నీ కాలప్రవాహంలో కొట్టుకుని పోతాయి. దేనిని చూసి నువ్వు గర్వపడకు, గర్వపడదగిన వస్తువు ఈ లోకంలో ఏదీ లేదు. అన్నీ కాలప్రవాహంలో కొట్టుకునిపోయేవే. My dear student, My dear boy, don't spoil the human birth. ఎంతకాలానికి వచ్చిందో ఈ మానవశరీరం, ఈ దేహాన్ని పాడు చేసుకోకు. మీ ఇంటికి ఎవరైనా చుట్టాలు వచ్చారు అనుకోండి మీ ఇంట్లో ఉన్న రూపాయి కాగితాలు పొయ్యిలో పెట్టి కాఫీ కాచి ఇస్తారా? కాచి ఇవ్వరు. అదేవిధంగా ఈ మానవజన్మని చిల్లర విషయాలకి ఖర్చు పెట్టుకోకు. ఎంతకాలానికి నీకు ఈ దేహం వచ్చింది. My dear boy, My dear student, don't spoil the human birth, It is attains very rarely. ఇది చాలా అరుదుగా లభిస్తుంది. నువ్వు ఎంత పుణ్యం చేసుకుంటే ఈ దేహం వచ్చిందో నీకు, నువ్వు ఎంత కష్టపడితే ఈ దేహం వచ్చిందో, భగవంతుడు ప్రీత్యర్థం నువ్వు ఎన్ని పనులు చేస్తే ఈ మానవదేహం వచ్చిందో, తీరా వచ్చేసింది ఈ మానవదేహం, వచ్చిన తరువాత దానిని సద్వినియోగం చేసుకో, చిల్లర విషయాలకి, ప్రయోజనంలేని విషయాలకి, నీ కాలాన్ని పాడుచేసుకోవద్దు, నీ దేహాన్ని పాడుచేసుకోవద్దు, నీ జీవితాన్ని spoil చేసుకోవద్దు, నీ మానవజన్మని వృథా చేసుకోవద్దు. చేతిలో ఉన్న అవకాశాన్ని విడిచిపెట్టుకోవద్దు, విడిచిపెట్టుకుంటే మళ్ళీ నీకు ఈ అవకాశం వస్తుందో, రాదో చెప్పలేము.

చిల్లర విషయాలకి, అక్కర్లేని గొడవలకి జీవితాన్ని పాడుచేసుకోవద్దు. ఆరోజుకారోజు మనం మరణానికి దగ్గర పడుతున్నాం. నీకు మరణం వచ్చింది అంటే ఒక్క క్షణం కూడా వాయిదా వెయ్యడు భగవంతుడు. ఇంకొక రోజు నాకు అవకాశం ఇమ్మంటే భగవంతుడు నీకు అవకాశం ఇవ్వడు. అందుచేత అవకాశం ఉన్నప్పుడు నువ్వు బాగుపడడానికి ప్రయత్నం చెయ్యి. My dear student don't spoil the human birth.

మోక్షంలోనే అమృతం ఉంది, అదే నిజమైన లక్ష్మి. లక్ష్మి అంటే మీకు కనిపించే రూపాయి కాగితాలు కాదు, నిజమైన లక్ష్మి మోక్షమే, చెరగని లక్ష్మి అది, నాశనం కాని లక్ష్మి. మోక్షమే నిజమైన లక్ష్మి అందుచేత ఆ మోక్షలక్ష్మిని నువ్వు పొందడం కోసం నీ నాలుకని అదుపులో పెట్టుకో, నీ ఇంద్రియాలని అదుపులో పెట్టుకో, నీ దేహాన్ని అదుపులో పెట్టుకో, నీ మనస్సుని అదుపులో పెట్టుకో. నీ ఇంద్రియాలు, నీ దేహం, నీ మనస్సు నీ స్వాధీనంలో ఉంటే నీకు మోక్షసుఖం అందుతుంది. వీటిని కంట్రోల్ చేసుకోవడానికి ప్రయత్నం చెయ్యి. అలా అని నువ్వు మొద్దు అబ్బాయిలా ఉండవద్దు. నేనేదో మీకు నాలుగు మాటలు చెబుతున్నాను అనుకో, ఇందులో reason ఉందా? లేదా? హేతుబద్ధంగా ఉన్నాయా? లేదా? లేకపోతే నోటికి వచ్చింది చెబుతున్నారా అని ఆలోచించుకో, మీ బుద్ధిని విడిచిపెట్టవద్దు. మీ బుద్ధి తోటి మీరు ఆలోచించుకోండి, నేను చెప్పినవి అన్నీ మీ సొంతం అవ్వవు, మీ బుద్ధి తోటి ఆలోచించుకున్నవి మీ సొంతం అవుతాయి అంటున్నారు ఆచార్యులవారు. నేను చెప్పినంత మాత్రం చేత మీరు చెవులు అప్పగించి వినడం కాదు. దానిని అర్థం చేసుకోవడానికి, దానిని డైజెస్ట్ చేసుకోవడానికి మీ శక్తి వంచన లేకుండా మీరు ప్రయత్నం చెయ్యండి. Digest చేసుకోండి, understand చేసుకోండి, మీ చైతన్య స్థాయిని పెంచుకోండి my dear students అంటున్నారు.

ఈ నాలుగు మాటలు నా తెలివితేటలు వల్ల, నా బుద్ధి వల్ల, నా పాండిత్యం వల్ల నేను చెప్పడం లేదు. By the blessings of lord Dakshinaamurthy. ఈ నాలుగు మాటలు నేను చెప్పగలిగాను అంటే ఇందులో నా తెలివి ఏమీ లేదు, నా ప్రజ్ఞ ఏమీ లేదు. ఆ దక్షిణామూర్తి, ఆ పరమేశ్వరుడి అనుగ్రహం వల్ల ఈ నాలుగు మాటలు నేను మీకు చెప్పగలిగాను. ఇదంతా

ఆయన అనుగ్రహమే, ఇదంతా ఆయన ప్రసాదమే, ఆయన అనుగ్రహం నాకు లేకపోతే ఈ నాలుగు మాటలు చెప్పే శక్తి నాకు లేదు అని ఆచార్యులవారే దక్షిణామూర్తి మీద పెట్టి చెబుతున్నారు. శంకరాచార్యుల వారు సర్వజ్ఞుడు. ఆయనకి తెలియని శాస్త్రం లేదు, తెలియని వ్యాకరణం లేదు. నేను ఎంతటి వాడిని? దక్షిణామూర్తి అనుగ్రహం వల్ల ఈ మాటలు నేను చెబుతున్నాను అని ఆచార్యులవారే అనుకుంటే ఇంక మనం దేనిని చూసి పొగరుబోతుతనానికి గురి అవుతున్నాం? By the blessings of lord Dakshinamurthy ఆయన నన్ను ఆశీర్వదించడం వలన, ఆయన blessings నా నెత్తి మీద ఉండడం వలన ఈ నాలుగు మాటలు చెప్పగలుగుతున్నాను అంటున్నారు ఆచార్యులవారు.

ఇంతవరకు నేను చెప్పిన మాటలు మీరు జాగ్రత్తగా శ్రవణం చేసుకుని, అర్థం చేసుకుని, మీ సొంతం చేసుకుంటే అజ్ఞానం అనే నిద్ర లోంచి మీకు మేలుకొలుపు అంటున్నారు స్వామివారు. ఈ మాటలు అన్నీ మనకి ఎందుకు చెబుతున్నారు అంటే మనవల్ల ఆయనకి ఏమీ పనిలేదు. కేవలం out of mercy, out of compassion, out of love చెప్పారు. నేను చెప్పిన మాటలు మీరు వినండి, అర్థం చేసుకోండి, అర్థం చేసుకుంటే మీకు దారి కనిపిస్తుంది, అప్పుడు మీరు ప్రయాణం చెయ్యవచ్చు, ఆచరించి గమ్యాన్ని పొందవచ్చు. ఈ మాటలు మీకు అర్థం అవుతుంటే మీ పూర్వజన్మల్లో చేసిన పనుల వల్ల మీ హృదయంలో పడ్డ ముద్రలు అన్నీ కూడా ఒకొక్క ముద్రని, ఒకొక్క ముద్రని ఒకొక్క మాట బయటకి లాగేస్తుంది, మీ పూర్వజన్మల నుంచి వచ్చిన దుర్వాసనలు ఏవైనా మీ హృదయంలో ఉంటే, ఈ మాటలు అన్నీ కూడా ఆ వాసనలను బయటకి కక్కిస్తాయి. బయటకి remove చేస్తాయి, ఈ మాటలే మీకు సర్జరీ చేసి పెడతాయి. ఈ సబ్జెక్టుని కనుక మీరు అర్థం చేసుకుంటే మళ్ళీ మీరు శవాలని మోయక్కర్లేదు, రోజూ వల్లకాటిలోకి వెళ్ళక్కర్లేదు, శాశ్వతమైన శాంతి, శాశ్వతమైన ఆనందం మిమ్మల్ని వరిస్తాయి. My dear students ఈ మాటలు మీకు అర్థం అవుతున్నాయా? ఈ మాటలు మీకు అర్థం అయితే మీ పూర్వజన్మల నుంచి వస్తున్న వాసనలని ఈ మాటలే కత్తెరలు కింద ఉపయోగపడి ఆ వాసనలని కట్ చేసి permanent happiness లోకి మిమ్మల్ని తీసుకెళతాయి. ఎప్పుడైతే వాసనాక్షయం మీకు అయ్యిందో, అప్పుడు శాశ్వత ఆనందంలోకి,

శాశ్వత శాంతిలోకి మీరు కళ్ళు తెరుస్తారు.

సర్వసాధారణంగా మనిషిలో మూడు దోషాలు ఉంటాయి. మలదోషం, విక్షేప దోషం, ఆవరణదోషం. మలదోషం అంటే ఏమిటి? పూర్వజన్మల్లో మానవుడు చేసినటువంటి పాపకర్మలు అన్నీ కూడా మలదోషం కింద ఉంటాయి. అంటే స్వార్థాన్ని దృష్టిలో పెట్టుకుని వాడు చేసిన పనులు అన్నీ కూడా మలదోషం కింద వస్తాయి. సత్కర్మ చేసి, మీరు కర్మఫలం కనుక త్యాగం చేస్తే మలదోషం పోతుంది. ఇంక రెండోది విక్షేపదోషం. విక్షేపదోషం అందరికీ ఎలా ఉంటుంది అంటే మేము పూజ చేసుకుంటున్నాం, మా మనస్సు నిలబడడం లేదు, గుళ్ళోకి వెళుతున్నాం మా మనస్సు నిలబడడం లేదు, విష్ణుసహస్రనామాలు చదువుతున్నాం, లలితా సహస్రనామాలు చదువుతున్నాం మా మనస్సు నిలబడడం లేదని చెబుతారు. ఈ మనస్సు నిలబడకపోవడానికి కారణం విక్షేపదోషం. ఆ విక్షేపదోషం ఎలా పోతుంది అంటే, భక్తి వల్ల నశిస్తుంది. ఇంక మూడు ఆవరణదోషం. ఆవరణ అంటే దొడ్డి. ఎవరి సంసారం వాడికి దొడ్డి. ఆవరణదోషం ఎలా నశిస్తుంది అంటే జ్ఞానయోగం వలన నశిస్తుంది అన్నారు.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**సంవత్సర చందా రు॥ 150/-లు.**

**శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు.**

రమణ భాస్కర చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి**

అకౌంట్ నెంబర్ **520101264185724** **(IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



దిII 23-09-2025 మంగళవారం సద్గురు శ్రీ నాన్నగారి జయంతి
సందర్భంగా ప్రత్యేక అలంకరణ - శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు

# నిజమైన అర్పణ

జీవుడు, మనస్సు, అహంకారము, అజ్ఞానమూ అన్నీ పర్యాయపదములే. ఇవన్నీ భ్రాంతి స్వరూపాలే. అవి మన తలంపు ఎంత నిజమో, అంత నిజం. యదార్థముగా జీవుడు లేదు జీవభ్రాంతి ఉంది. మోక్షప్రాప్తికి అట్టి జీవత్వాన్నే అర్పణ చేయాలి. అహంకారాన్ని త్యజించకుండా మనస్సుని భద్రంగా ఉంచుకొని, బాహ్యంలో శాంతిని కోరుకుంటున్నాం. శాంతి మన స్వరూపంగానే ఉంది, దానికి ఆటంకంగా నిలిచేది మన మనస్సే అని తెలుసుకుంటే, శాంతిని బాహ్యంలో వెతకడం మానేసి, అంతరంలో కనుక్కోవడం నేర్చుకుంటాం. మనకు ఎదురయ్యే అశాంతికి, దుఃఖానికి కారణం మన మనస్సే. కాబట్టి మనస్సనే ఆటంకాన్ని తొలగించుకోవడానికి ఆత్మ విచారణ చేయమన్నారు. అదే విచారణామార్గం, దాని ఫలితం అజ్ఞాన నివారణం. మన హృదయంలోనే, మన స్వరూపంలోనే ఆనందం ఉంది, అనంతమైన సుఖం ఉంది. భౌతిక విషయాల నుండి మనము ఇంద్రియాల ద్వారా పొందుతున్న సుఖము కేవలం ఆత్మ వలన కలిగిన ఆభాస సుఖము మాత్రమే. అది పరిమితులకు లోబడి ఉంటుంది. ఆత్మసుఖం అనగా స్వరూపసుఖం సర్వకాల సర్వావస్థలలోనూ ఎడతెగకుండా ఉంటుంది, అది నిత్యసుఖం. స్వరూపము (లేదా) ఆత్మ అనంతము, అఖండము, సచ్చిదానందము, దేశకాల, కార్యకారణాలకు అతీతము. అన్ని కాలాలలో అన్ని ప్రాంతాలలో అన్ని పరిస్థితులలో ఆత్మ స్థిరముగా ఉంటుంది కాబట్టి ఆత్మానందం నిరంతరం అవిచ్ఛిన్నంగా కలుగుతుంది. మనము ఆశించే విషయసుఖాలు చివరకు దుఃఖాన్నే ఇస్తాయి. దేహతాదాత్మ్యం వలన ఉపాధి దుఃఖములన్నింటినీ తనపై ఆరోపించుకుని దుఃఖపడుట జరుగుతోంది. మానవుని దుఃఖానికి, అశాంతికి అజ్ఞాన జనిత దేహతాదాత్మ్యమే కారణమై ఉన్నది. జీవునికి దుఃఖము సమూలముగ తొలగిపోయి, శాశ్వతమైన ఆనందము కలుగవలెనంటే, తనయొక్క వాస్తవ సచ్చిదానంద స్వరూపమును అనుభవములోనికి తెచ్చుకోవాలి. ఇంట్లో పోగొట్టుకున్న సూది కోసం ఇల్లు మినహాయించి బయట అంతటా వెతకడం వెర్రితనమే అవుతుంది. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడ వెతికినప్పుడే, పోగొట్టుకున్న వస్తువు దొరుకుతుంది. అదేవిధముగా అంతర్ముఖములో, అజ్ఞానంలో పోగొట్టుకున్న మనశ్శాంతిని అక్కడే వెతికి సంపాదించాలి, బహిర్ముఖంలో వెతికితే అది ఏనాటికి లభ్యము కాదు. మట్టిలోనే మాణిక్యమున్నట్లు, మానవుని హృదయంలోనే శాంతి స్వరూపంగా ఉంది. కాబట్టి మనస్సుని అంతర్ముఖము చేసి, అజ్ఞానాన్ని నిర్మూలించుకుంటే మానవుడే మాధవుడు అవుతాడు. దేహాన్ని నేనుగా భావిస్తున్నంతకాలం మనస్సుకి శాంతి ఉండదు, స్వరూపం అనుభవంలోకి వస్తే అసలు మనస్సనేదే ఉండదు. శాంతి మన సహజస్థితి. ప్రశాంత మనస్సును, వివేక సహితమైన బుద్ధిని సాధించాలి.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**